క్లుప్తంగా

ఐటీ పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు

యానాం: ఆంగ్లో ఫ్రెంచ్ టెక్స్‌టైల్ మిల్ ప్రాంతంలో ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి బహుళజాతి కన్సల్టెన్సీ సంస్థ ఎర్నస్ట్ అండ్ యంగ్(ఈఅండ్‌వై) సంస్థ అధికారులు శనివారం వివరణాత్మక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఎం రంగసామి, మంత్రుల ఎదుట ఐటీ, పారిశ్రామిక యూనిట్ల అభివృద్ధికి నమూనాలను అందించారు.

ఎంపీటీసీ సభ్యురాలు నాగమ్మ మృతి


నాగమ్మ (ఫైల్)

తాళ్లరేవు: జార్జిపేట ఎంపీటీసీ సభ్యురాలు మందపల్లి నాగమ్మ(78) శనివారం మృతి చెందారు. జార్జిపేట ఎంఎల్‌కే నగర్‌కు చెందిన నాగమ్మ వైఎస్సార్ సీపీ పార్టీ తరఫున ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. నాగమ్మ భౌతిక దేహానికి ఎంపీపీ రాయుడు సునీత, గుత్తుల సూర్యనారాయణ, కూనపురెడ్డి కామేశ్వరరావు, రాయుడు గంగాధర్, కడలి శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

తాళ్లరేవు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావు శనివారం డిమాండ్ చేశారు. వారం రోజుల పాటు పలు గ్రామాల్లో ఉపాధి హామీ వేతనదారులను కలిసి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నామన్నారు. పెండింగ్ వేతనాలను ఇప్పించాలని, జిల్లా నుంచి అనుమతులు వచ్చిన పనులను వెంటనే ప్రారంభించాలని, మేట్లకు మొబైల్‌ఫోన్లు ఇవ్వాలని, ప్రతి వేతనదారునికి రోజుకు రూ.300 వేతనం, ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని కోరారు.

దోమల నిర్మూలనకు చర్యలు


ముమ్మిడివరం: స్థానిక ఎస్సీ బాలికల, బీసీ బాలుర కళాశాల, బీసీ, ఎస్సీ, గురుకుల పాఠశాల వసతి గృహాల్లో మలాథియాన్ ద్రావణాన్ని శనివారం పిచికారీ చేయించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో వసతి గృహాల్లో దోమల నిర్మూలన కోసం చర్యలు తీసుకుంటున్నట్లు అమలాపురం సబ్ యూనిట్ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.సంపూర్ణ, పి.రాధమ్మ, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి


శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తాళ్లరేవు: మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో టేకుమూడి ఈశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత శ్రీశ్రీ రచనలను చదవాలన్నారు. సమాజ హితానికి శ్రీశ్రీ చేసిన రచనలను కొనియాడారు.

హోంమంత్రి అనితకు అభినందనలు


హోంమంత్రి అనితకు అభినందనలు తెలుపుతున్న అమలాపురం నాయకులు

అమలాపురం టౌన్: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి శనివారం వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను అమలాపురానికి చెందిన పలువురు నాయకులు, వ్యాపార ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా పెట్రోలుబంకుల సంఘం ప్రతినిధి జవ్వాది తాతబాబు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి తదితరులు మంత్రి అనితకు పుష్పగుచ్ఛాలు, పూలకుండీలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సముచిత స్థానంపై హర్షం

అమలాపురం టౌన్: రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వ మంత్రి వర్గంలో యాదవులకు సముచిత స్థానం ఇవ్వడంపై భారతీయ యాదవ మహాసభ జిల్లా సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా సంఘం కన్వీనర్ మట్ట రాంబాబు, కోకన్వీనర్ కోరశిఖ సుబ్రహ్మణ్యం తదితరులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రి వర్గ కూర్పులో యాదవ సామాజిక వర్గానికి చెందిన కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, సవితలకు స్థానం కల్పించడం సంతోషదాయకమన్నారు.

బాలల భవితకు భరోసా

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వృత్తి విద్యలో శిక్షణ
- కుట్లు, అల్లికలతో ఆకట్టుకుంటున్న విద్యార్థులు
- వృథా వస్తువులతో అందమైన కళాకృతుల తయారీ

ఉప్పలగుప్తం: పిల్లలు బడికి వెళ్లి చదువుకుంటే చాలు అనేది రెండుమూడు దశాబ్దాల క్రితం నాటి తల్లిదండ్రుల ఆలోచన. మా పిల్లలు చదువుతో పాటు ఏదైనా వృత్తిలో రాణించి ఆదర్శంగా ఉండాలనేది నేటి తల్లిదండ్రుల అభిప్రాయం. దీని కోసమే వేలకు వేలు ఖర్చు పెట్టి ప్రైవేటు పాఠశాలలలో చదువుతున్న పిల్లలకు అదనంగా సాంస్కృతిక, క్రీడా, కరాటే, వృత్తి నైపుణ్యంలో శిక్షణనిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం విద్యార్థులకు చిన్ననాటి నుంచి ఏదొక వృత్తిని అలవరచాలనే దృక్పథంతో విద్యా హక్కు చట్టంలో వృత్తి విద్యలో శిక్షణనిస్తున్నారు.

వారంలో ఒకరోజు క్రాఫ్ట్ తరగతులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వృత్తి విద్యలో శిక్షణనిచ్చేందుకు ప్రతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు సిబ్బందిని నియమించారు. పిల్లలకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు వారంలో ఒక రోజు క్రాఫ్ట్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో విద్యార్థులు వారి నైపుణ్యాన్ని పెంచుకునేలా చేతికుట్లు, కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ వర్క్, బుట్టల తయారీ, పనికిరాని వస్తువులను నిత్యావసరాలుగా మార్చడం, పేపర్‌తో అలంకరణకు సంబంధించిన వస్తువుల తయారీ, పగిలిన పాత గాజులను అల్లికలతో సుందరంగా తయారుచేయటం, వాడి పాడేసిన పెన్నులు, అగ్గిపుల్లలతో వస్తువుల తయారీ, దుస్తులపై కుట్టుతో అక్షరాలను రాయటం వంటి విద్యలను ప్రత్యేకంగా నేర్పిస్తున్నారు. ప్రతి తరగతి గదిలో గ్రూపుల వారీగా ఒకరికొకరు పోటీగా ఎంతో సుందరమైన, అందమైన కళాకృతులను తయారుచేస్తున్నారు. అవి అందరినీ ఆకట్టుకుంటున్నాయి.


మునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంబ్రాయిడరీ వర్క్ నేర్చుకుంటున్న విద్యార్థినులు


కాగితాలతో తయారుచేసిన పేపర్ క్రాఫ్ట్


విద్యార్థులు తయారుచేసిన పడవ

ప్రత్యేక తరగతులతో ప్రయోజనాలెన్నో

విద్యార్థులకు వారానికి ఓ రోజు చదువుకు విరామమిచ్చి వృత్తి విద్యను నేర్పించడం వల్ల ఆటవిడుపుగా ఉండడంతో పాటు భవిష్యత్తులో ఇదే వృత్తి విద్య ఎంతో భరోసా కల్పిస్తుందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రతి విద్యార్థికి ఇలా వృత్తి నైపుణ్యంపై అవగాహన పరచటంతో భావితరాల్లో వారు ఉత్తమ పౌరులుగా మెలుగుతారంటున్నారు. ప్రధానంగా విద్య వల్ల కలిగే మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. టీమ్ వర్క్ అలవడటం, ఒకరికొకరు సహకారమందించుకునే దృక్పథం ఏర్పడం, ఆలోచనా సామర్థ్యం వంటివి పెరుగుతాయంటున్నారు.

ఒత్తిడి తగ్గించాలనే..



పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేకంగా చదువుపైనే దృష్టి పెడితే మానసికంగా ఒత్తిడి గురవుతారు. విద్యా హక్కు చట్టం ప్రకారం క్రీడా, వృత్తి నైపుణ్యం, కళాత్మక తరగతులను సమయానుకూలంగా నిర్వహించడంతో వారిలో ఉన్న ఒత్తిడి తగ్గి చదువుపై ఆసక్తి చూపిస్తారు.

– సత్తి సత్యకృష్ణ, ఎంఈవో–2, ఉప్పలగుప్తం మండలం

ఆసక్తిగా నేర్చుకుంటున్నాం



బడిలో చెప్పే పాఠాలతో పాటు ఇలా వృత్తి నైపుణ్య తరగతులు నిర్వహించటం బాగుంది. తరగతి గదుల్లో గ్రూపులుగా విభజించి నేర్పిస్తున్న వృత్తి విద్యను ఆసక్తిగా నేర్చుకుంటున్నాం. ఈ నైపుణ్యంతో ఇంటి దగ్గర ఖాళీ సమయంలో పనికిరాని వాటితో ఏదొక వస్తువును తయారు చేసి చూపిస్తుంటే అందరూ అభినందిస్తున్నారు.

– చిక్కం సత్యశ్రీ, పదో తరగతి విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, మునిపల్లి

విద్యార్థులు మంచి ప్రతిభ చూపిస్తున్నారు



చిన్నతనం నుంచే వృత్తి విద్యను నేర్చుకోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులకు ప్రతి తరగతికి వారానికి ఓరోజు క్రాఫ్ట్ తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులంతా ఎంతో ఆసక్తిగా నేర్చుకోవడమే కాకుండా వృత్తి విద్యలో మంచి ప్రతిభ చూపిస్తున్నారు.

– తోరం శ్రీలక్ష్మి, వృత్తి నైపుణ్య ఉపాధ్యాయురాలు, జెడ్పీ ఉన్నత పాఠశాల, కోదూరుపాడు, అల్లవరం మండలం

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు విరాళం


దాత కందికట్టు శ్రీనివాస్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఏలూరుకు చెందిన కందికట్టు శ్రీనివాస్ దంపతులు రూ.50 వేల విరాళమిచ్చారు. దాత కుటుంబీకులు శనివారం ఆలయంలో స్వామిని దర్శించుకుని విరాళాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ శేష వస్త్రం, స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేసి సత్కరించారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభానికి చర్యలు

ముమ్మిడివరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ముమ్మిడివరంలో అన్నా క్యాంటీన్ మళ్లీ ప్రారంభించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. ముమ్మిడివరం బల్లగేటు సెంటర్‌లో గతంలో అన్నా క్యాంటీన్ నిర్వహించిన భవనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకూ ఆ భవనంలో ఉన్న సచివాలయాన్ని నగర పంచాయతీ కార్యాలయంలోకి మార్చాలని సిబ్బందిని ఆదేశించారు. భవనానికి అవసరమైన మరమ్మతులు చేసి క్యాంటీన్ నిర్వహణకు సిద్ధం చేయాలన్నారు.

చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే


బండారులంక అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక అంగన్‌వాడీ కేంద్రంలో బాల విద్య పూర్తి చేసుకుని ఒకటో తరగతిలో ప్రవేశిస్తున్న చిన్నారులకు శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయ కుమారి మాట్లాడుతూ చిన్నారుల విద్యకు తొలి మెట్టు అంగన్‌వాడీ కేంద్రాలేనన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యను బోధించడమే కాకుండా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. సర్పంచ్ పెనుమాల సునీత మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, అటువంటి పౌరులను తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బిరెడ్డి రామదాసు ట్రస్ట్ సేవలు అభినందనీయం


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

అమలాపురం టౌన్: స్థానిక చెడీ తాలింఖానా విద్య గురువు దివంగత అబ్బిరెడ్డి రామదాసు పేరిట ఆయన కుటుంబీకులు నెలకొల్పిన ఫౌండేషన్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని నిమ్మకాయల వెంకటరంగయ్య వాలీబాల్ టోర్నమెంట్ వ్యవస్థాపకుడు నిమ్మకాయల జగ్గయ్యనాయుడు అన్నారు. అబ్బిరెడ్డి రామదాసు 75వ జయంతి సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అబ్బిరెడ్డి సురేష్ ఆధ్వర్యంలో స్థానిక మహిపాలవీధిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన మెగా రక్తదాన శిబిరంలో 75 మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరాన్ని ముఖ్య అతిథి జగ్గయ్యనాయుడు ప్రారంభించారు. కిమ్స్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ వైద్యుడు పీఎస్ శర్మ, సిబ్బంది వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా స్థానిక ఏఎస్ఎన్ కళాశాల విద్యార్థిని హెచ్.ప్రవల్లికకు ట్రస్ట్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో దూడల ఫణి, తిక్కిరెడ్డి నేతాజీ, కర్రి రాఘవ, తోట శ్రీను, జంగా అబ్బాయి వెంకన్న, మండేల బాబి, మలిశెట్టి మూర్తి, బండారు రాము, నల్లా అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం


గురుకులంలోని సమస్యలపై ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్ కిరణ్మయి

అల్లవరం: గోడిలోని బాలికల గురుకులం పాఠశాల ఆవరణలో పెరిగిన తుప్పలు, పిచ్చి మొక్కలను తొలగించడానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. బాలికల గురుకులంలోని సమస్యలపై ప్రిన్సిపాల్ కిరణ్మయి శనివారం ఎంపీడీఓని కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై ఎంపీడీఓ స్పందించి ఉపాధి హామీ పథకం ద్వారా పాఠశాల ఆవరణలోని జంగిల్స్ క్లియర్ చేస్తామని ప్రిన్సిపాల్‌కు తెలిపారు. గురుకులంలో నీటి సమస్య, ఫ్యాన్లు తదితర సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యా ప్రవేశ్'ను విజయవంతం చేయాలి

సమగ్ర శిక్షా ఏపీసీ మధుసూదనరావు


వాడపాలెంలో నాడు–నేడు పనులపై ఎంఈఓ హరిప్రసాద్‌తో సమీక్షిస్తున్న మధుసూదనరావు

కొత్తపేట: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) ఎ.మధుసూదనరావు ఉపాధ్యాయులకు సూచించారు. వాడపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించి, నాడు–నేడు పనులను పరిశీలించారు. ఆయా పాఠశాలలు, మండలంలో పాఠశాలల పనుల పురోగతిపై ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, హెచ్‌ఎంలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 1,240 ప్రాథమిక, 86 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు 90 రోజులు పాటు విద్యాప్రవేశ్ కార్యక్రమం అమలు చేయాలన్నారు. రోజువారీ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను అంకితభావంతో అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బడి ఈడు చిన్నారులు స్కూళ్లలో ఉండేలా రాష్ట్ర విద్యా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 'నేను బడికి పోతా' అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ నెల 19వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాల పరిధిలో నిర్వహించాల్సి ఉందన్నారు. అసంపూర్తిగా ఉన్న నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధుల మేరకు పనులను పూర్తి చేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు.

హరికుమార్‌కు పీహెచ్‌డీ ప్రదానం

యానాం: పట్టణానికి చెందిన పి.హరికుమార్‌కు శనివారం జేఎన్‌టీయూకే పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా 'ఏ స్టడీ ఆన్ కస్టమర్ బయింగ్ బిహేవియర్ టువార్డ్స్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీస్(విత్ రిఫరెన్స్ టు కోస్టల్ ఆంధ్రప్రదేశ్) అనే అంశంపై ఆయన పరిశోధన వ్యాసం సమర్పించినందుకుగాను ఆయన పీహెచ్‌డీ అందుకున్నారు. ఇన్సూరెన్స్ సెక్టార్‌లో పాలసీదారుడు యొక్క ప్రవర్తన తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం పరిధిలో ఈ పరిశోధన నిర్వహించారు. ఆయన ప్రస్తుతం దరియాలతిప్ప డాక్టర్ కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గతంలో ఆయన యానాం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా సైతం సేవలందించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలే ఉపయోగించాలి

ముమ్మిడివరం: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లోనూ ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలు మాత్రమే ఉపయోగించాలని ముమ్మిడివరం ఎంఈఓ బొజ్జా రమణశ్రీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇతర పబ్లిషర్స్‌కు చెందిన పాఠ్యపుస్తకాలు ఉపయోగించే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలకు ఇండెంట్ పెట్టకుండా ప్రైవేటు పాఠశాలల్లో వేరే పబ్లిషర్ పుస్తకాలు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ముమ్మిడివరం భాష్యం పాఠశాలలో సహస్ర పబ్లిషర్స్‌కు సంబంధించిన పుస్తకాలు విక్రయిస్తున్నట్లు తమ తనిఖీలో వెల్లడైందన్నారు. ఆ పాఠశాలపై చర్యలకు జిల్లా విద్యాశాఖాధికారికి నివేదించామన్నారు.

ప్రతి విద్యార్థికి కిట్లు చేరాలి


రికార్డులను పరిశీలిస్తున్న అబ్జర్వర్ మాధవీలత

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్లు చేరేలా ప్రణాళిక అమలు చేసినట్టు ఎస్సీఈఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) అబ్జర్వర్ మాధవీలత అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్‌కు సంబంధించిన పుస్తకాలు, నోట్ పుస్తకాలు, టైలు, బెల్ట్‌లు, షూలు, సాక్సులు, తదితర వాటి రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి మండలంలో ఈ నెల 13న స్కూళ్ల ప్రారంభానికి ముందుగానే ఆయా పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేసి, విద్యార్థులకు పంపిణీ చేశారన్నారు. ఏడో తరగతికి సంబంధించి ఒక్క పాఠ్యపుస్తకం పంపిణీ కాలేదన్నారు. ఈ నెల 22వ తేదీలోగా ఏడో తరగతి పాఠ్య పుస్తకాలతో పాటు, మిగిలిన విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, షూలు, నోట్ పుస్తకాలు, బెల్ట్‌లు తదితర సామగ్రి రెండో విడత పంపనున్నామన్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన టీచర్ల కాపీ పంపిణీ చేయాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. దీనిపై ఆమె స్పందించి త్వరలో పంపుతామని చెప్పారు. ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్‌ఎం కడలి సాయిరామ్, సీఆర్పీలు పాల్గొన్నారు.

కిట్ల స్టాక్ పాయింట్ పరిశీలన

రావులపాలెం: విద్యార్థి కిట్ల స్టాక్ పాయింట్ ఉన్న స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను అబ్జర్వర్ మాధవీలత సందర్శించారు. మండలానికి వచ్చిన పుస్తకాలు, బెల్టులు, బూట్ల నాణ్యతను పరిశీలించారు. వాటిని పాఠశాలలకు పంపించడం, విద్యార్థులకు పంపిణీ చేయడం తదితర విషయాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా మొబలైజేషన్ అధికారి బీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ–2 బి.శ్రీనివాసరాజు ఉన్నారు.

ఎమ్మెల్యే ఆనందరావుకు సత్కారం


ఎమ్మెల్యే ఆనందరావును సత్కరించిన పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా సంఘం ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేను అభినందించిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ నాయుడు, కోశాధికారి జీఎస్ శర్మ, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.శివప్రసాదరావు, సంఘం ప్రతినిధులు రంకిరెడ్డి కాశీ, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, షహీరా, బీవీవీ సత్యనారాయణ తదితరులున్నారు.

రూ.30 లక్షలతో సర్క్యూట్ బ్రేకర్ ఏర్పాటు


పేరూరు సబ్ స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న ఈఈ మోకా రవికుమార్

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరులో సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా రూ.30 లక్షలతో కొత్తగా సర్క్యూట్ బ్రేకర్, విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్, 11 కేవీ ఫీడర్‌ను ఏపీఈపీడీసీఎల్ డివిజన్ ఈఈ మోకా రవికుమార్, ఈఈ వై.డేవిడ్, ఏడీఈ ఉషారాణి, ఏఈ ఆచారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ రవికుమార్ మాట్లాడుతూ ఎస్‌కేబీఆర్ ఫీడర్‌లో ఓవర్ లోడ్ వల్ల విద్యుత్ అంతరాయాన్ని తగ్గించేందుకు కొత్త సర్క్యూట్ బ్రేకర్, 2 కిలోమీటర్ల మేర 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని వల్ల అమలాపురం పట్టణంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

కండక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా


రాజోలు ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

రాజోలు: ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన కండక్టర్ కె.శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం రాజోలు ఆర్టీసీ డిపో ఎదుట యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మే 14న పి.గన్నవరం మండలం ఊడిమూడిలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో చనిపోయిన ఆరుగురిలో కండక్టర్ శ్రీనివాసరావు కూడా ఉన్నారన్నారు. మృతుడు శ్రీనివాసరావు కుటుంబానికి సంస్థ ద్వారా అన్ని ఆర్థిక ప్రయోజనాలను తక్షణం చెల్లించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఏఎస్ నారాయణ మాట్లాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్న డబుల్ డ్యూటీ విధానాలను రద్దు చేయాలన్నారు. డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, ఈహెచ్ఎస్ నుంచి మినహాయించి రిఫరల్ వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తొమ్మిది ఆర్టీసీ డిపోలకు చెందిన యూనియన్ నాయకులతో పాటు, సంఘ ప్రతినిధులు వి.గణపతి, బీఆర్‌కే కుమారి, కేఎస్‌పీ రావు తదితరులు పాల్గొన్నారు.

వేతనం చెల్లించాలని బీఎల్ఓల వినతి


మామిడికుదురు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎల్ఓలు

మామిడికుదురు: ఎన్నికల విధుల్లో పాల్గొన్న బూత్ లెవెల్ అధికారులకు చెల్లించాల్సిన వేతనం నాలుగేళ్లుగా ఎన్నికల సంఘం చెల్లించటం లేదని బీఎల్ఓలు వాపోయారు. దీనిపై శనివారం తహసీల్దార్ మెరికమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఓటరు జాబితా తయారీలో భాగంగా నూతన ఓటర్ల నమోదు, మృతి చెందిన వారు, వలస వెళ్లిన ఓటర్ల తొలగింపు, ప్రత్యేక కార్యక్రమాలు, ఇంటింటా సర్వే, ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఏడాదికి రూ.ఆరు వేల వంతున నాలుగేళ్లకు రూ.24 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్నికల రోజున విధుల్లో పాల్గొన్నందుకు రూ.500, ఇంటింటా సందర్శనానికి రూ.వెయ్యి వంతున చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, తమకు రావాల్సిన వేతనం, పారితోషికం చెల్లించాలని కోరారు. బీఎల్ఓల ప్రతినిధులు టి.శ్రావణి, కె.సత్యలత, వి.రోజా, సీహెచ్ మనీషా, జె.ఫాతిమా, ఎన్.సుధీర్, ఎం.సుభాష్, కె.ప్రవీణ్, కె.వినయ్‌కుమార్ ఉన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి టీకాలు తప్పనిసరి


చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ఉప కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో ఆలమూరు–1. ఆలమూరు–2, పెనికేరు, పినపళ్ల, సూర్యారావుపేట, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్ కాలనీ, మడికి శివారు మల్లవానితోట, మూలస్థాన అగ్రహారం, గుమ్మిలేరు గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యానికి టీకాలు తప్పనిసరి అని వైద్యాధికారులు తెలిపారు. ఈ టీకాల ప్రక్రియను సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్.బాలామణి పర్యవేక్షించారు.